పిడకల గంప

శ్రీ కావుటూరు వెంకటనారాయణరావు

రాజుకు బదిలీ అయింది. అతను మొట్టమొదట సారిగా పల్లెలకు బదిలీకావడంతోటి, అతనిలో యేదో చెప్పలేని బాధ చెలరేగి, మనసును కల్లోలపరిచింది. అతనింతవరకు పట్నవాసపు మురికిసందులు దాటి, యెల్లప్పుడూ కార్లు, సైకిళ్ళ రణగొణ ధ్వనులను వినకుండా యింతవరకు వుండలేదు! బస్తీలోని యెర్రమట్టితో అతను కలిసి పోనిరోజు యింతవరకూ రాలేదు. సాయంత్రమయేటప్పటికి విద్యుద్దీప కాంతులు చూడకుండా ఒక్క క్షణముండలేదు. ఆ కాంతుల కలయికలో తను స్వర్గసుఖ మనుభవిస్తాడు. తనుండే సందులోని సర్వమాలిన్య గంధాన్ని, సుగంధంగా పీల్చని సమయం అతని జీవితంలో నీటి బుడగ లాంటిది. అందుకనే, రాజు తను ప్రభుత్వానికి, లోకానికి యెంతో సహాయం చేస్తుంటే, అవి తనకు యింత అన్యాయం చేసినందుకు, తనకు అనుకూలించని యితర పరిస్థితులనుకలిపి, అసహ్యించుకుని యేకంగా తిట్టుకున్నాడు.

రాజు సెకండరీగ్రేడు పూర్తిచేసి రెండు సంవత్సరాలయినప్పటికీ బస్తీలోనే గడిచిపోయింది. మోటు జీవితమంతా పల్లెపట్టులో వుందనుకుంటాడు. తనకక్కడ కాలకృత్యాలు తీర్చుకోకముందే బెడ్ కాఫీ యెవరిస్తారు? బస్తీలో అయితే హోటలయ్యరు కాఫీ ఆవిర్లతో తన్నాహ్వానిస్తాయి. రాజుకు రెండిడ్లీలు, నిండా సాంబారుతోవున్న ప్లేటు కళ్లకు కట్టేటప్పటికి, వుద్యోగం వదిలివేద్దామన్నంత కోపం వచ్చింది.

బస్సులో ముందుసీటులో కూర్చుని తనను వదిలిపోతున్న బస్తీలోని హోటళ్లను, ఆఫీసులను, నాటకశాలలను, సినిమారంగాలనుచూచి, స్వర్గంనుండి భూలోకచ్యుతుడైన నహుషునిలా బాధపడ్డాడు. ప్రయాణంలోనే తన్నానుకుని కూర్చున్న పెద్దమనిషితో బాగా పరిచయమయింది రాజుకు. అతని పరిచయంతో రాజుకెంతో సంతోషమయింది. తను పల్లెలకుపోవడం క్రొత్త! అక్కడ తనకెవ్వరూ తెలియదు! తను నివాసానికి యెంతగా కష్టపడాలో అని ఆలోచించుకుంటున్న రాజుకు ఆ సంశయాలన్నీ తెగదెంపులయ్యాయి. తనకు పరిచయమైన ఆ నూతన వ్యక్తి తను పోబోయే పల్లె కరణమే! అతనిపేరు వీరరాఘవనాయుడు. నాయుడుగారితో పరిచయమైనప్పటినుండి రాజు, ఆ వూరి ప్రకృతిని మెల్లగా ఒకటి వెంబడి మరొకటి తెలుసుకున్నాడు.

రాజు తనకు బదిలీఅయినచోట అడుగు బెట్టినపుడు నాయుడు తన స్వగ్రామంగూర్చి యేమీ పొగడలేదనుకున్నాడు. తనకు మంచి వసతి, బడికి ప్రక్కగా పెంకుటిల్లు - లోపల శుభ్రంగా గచ్చుపూసివుంది. ముందర ఓ వేపచెట్టు, నాలుగు పూలమొక్కలు వున్నాయి. రాజు ఆ వసతికెంతో సంతోషించాడు. తన గది కెదురుగానే వూరి మంచినీటి బావి. తను ప్రొద్దుననే లేచేటప్పటికి, పల్లె సౌందర్యం కళ్ళారా చూడవచ్చుననుకుని సంతోషించాడు.

వూరు యేమంత పెద్దదిగాదు. ఓమైలు పొడవు, ఓ అరమైలు వెడల్పు వుంటుంది. చాలా వరకు వూరికొంపలన్నీ అగ్ని దేవునికి భయపడి మిద్దెలుగా, పెంకుటిల్లుగా మారిపోయాయి. వూరికి రెండు దిక్కులా రెండు చెరువులున్నాయి. తూర్పు చెరువు గట్టుమీద నాగేశ్వరుని ఆలయం. వూరిలో ఓ పది వైశ్యకుటుంబాలున్నాయి. తక్కిన వారిలో ఓ మూడు బ్రాహ్మణ కుటుంబాలు.

సాయంత్రం పనిముగించుకొని, రాజు చెరువుగట్టు మీది నాగేశ్వరాలయానికి వెళ్ళాడు. ఆలయం ముందు ఓ పెద్ద నందీశ్వరుని విగ్రహం గంభీరంగా వుంది. దాన్నానుకుని ఓ ముప్పయి అడుగులయెత్తున

ధ్వజస్తంభం. దాని చిరుగంటలు గాలికి గణగణమంటూ యెంతో హాయి గొల్పుతున్నాయి. ఆ ధ్వజస్తంభంచుట్టూరా ఓ పదడుగుల వ్యాసంలో ఓ అరుగు. ఆ అరుగుమీద కూచుంటే చెరువులోని యెుర్రనీటిని తాకివస్తున్న పిల్లవాయువులు కూని రాగాలు తీస్తున్నాయి. ఆ దృశ్యం రాజుకెంతో మనోజ్ఞంగావుంది. అక్కడినుండి కదలలేకపోయాడు. అక్కడి పిల్లగాలులకు తన శరీరం తేలిపోయింది.

రాజు అక్కడికి చేరుకునేటప్పటికి ఆలయం తలుపులు తీసివున్నాయి. మెల్లగా లోనికి వెళ్ళాడు రాజు. లోపల అర్చకుడు మంత్రోచ్చారణతో తన ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాడు. రాజుకు తెలియకుండానే అతని రెండుచేతులు కలుసుకున్నాయి. అలా చేతులు రెండూ జోడించి, కండ్లు రెండూ మూసుకుని యెంతసేపు నిలిచాడో అతనికే తెలియదు. బైటికి వచ్చేటప్పటికి వూరి పెద్దలు నలుగురు అరుగు మీద వుండడం చూచాడు. మరలా లోనికి వెళ్లాడు రాజు. ఆలయంలోని శివుని లింగం చూస్తుంటే, తను బస్సులో ప్రయాణం చేస్తుంటే, నాయుడుగారిద్వారా విన్నమాటలన్నీ వూహకు వచ్చాయి. అది పుట్టు లింగమట! ఆ వూరివారి భక్తికి అదక్కడ వెలసిందట! ఆ లింగంమీద ఓ అయిదుతలల నాగుసర్పం, రాగితో చేసింది పెట్టివుంది. నాగేశ్వరుడు తూర్పు ముఖంగా వున్నాడు. దక్షిణ ముఖంగా పార్వతి వుంది. ఆలయంచుట్టూరూ తిరిగాడు ఒకసారి రాజు. ఒక తట్టు వినాయకునిగుడి నేరుగావుంది. మరొక తట్టు మూగ సిద్దయ్య విగ్రహం. చెరువులోని మెట్లకు మూరెడుదూరం యివతల లింగాకారంలో ఓ తెల్లనిబండ. అదేమిటో రాజుకు తెలియలేదు. ఇవన్ని చూచుకుని, అరుగు చేరుకునేటప్పటికి, అక్కడివారు యేదో మాట్లాడుకుంటున్నారు. వారిలో నాయుడుగూడా వుండడంచూచి రాజు సంతోషంతో నమస్కరించాడు. నాయుడు ప్రతి నమస్కారంతో అక్కడి పెద్దలకు రాజును పరిచయంచేశాడు. రాజుగూడా వారి ప్రక్కనే అరుగుమీద కూర్చున్నాడు.

"ఏమండి రాజుగారు! దేవుణ్ణి చూచి వచ్చారా?" అన్నాడు నాయుడు. దానికి రాజు మెల్లగా నవ్వుతూ "ఆ! నా జీవితంలో వూహ తెలిసినప్పటినుండీ యిదే మొదటిసారి!" అన్నాడు.

రాజు అన్నమాటలకు నాయుడు కళ్లు చాటంతవి చేసుకుని అతనితట్టు చూడసాగాడు. చుట్టున్నవారు కూడా ఆశ్చర్యపడ్డారు.

"ఆ! బస్తీలో యింతకంటే గొప్ప ఆలయాలున్నా నేను, వాటితట్టు పోయిన పాపానపోలేదు. కాని యీ రోజు, ఆలయంలో అడుగుబెట్టానో లేదో, యేదో తెలియని ఆనందం నన్నావరించింది. నా కళ్ళలానే మూతలు బడ్డాయి. అప్పటికి యిప్పటికి నాలో యేదో మార్పు! బస్తీయే స్వర్గమనుకున్న నాలో యేదో నూతన చైతన్యం పొడచూపింది."

అప్పటికి పూజ పూర్తిచేసుకుని అర్చకుడు బైటికి వచ్చాడు. అతన్నిచూచి నాయుడు తదితరులు నమస్కారం చేశారు. రాజు అతన్నిచూస్తూ నమస్కరించడంకూడా మరిచిపోయాడు. దగ్గర దగ్గర యెునిమిదో పడిలో వున్నాడా అర్చకుడు. తనువు కొద్దిగా వంగివుంది. తలమీద ఒక్క వెంట్రుక లేదు. చర్మమంతా ముడుతలుబడి తళతళ మెరుస్తూవుంది. మెడలో ఓ రుద్రాక్ష, తులసిపూసల పేరుంది. ఫాలం, దండలు, హృదయం విబూధి రేఖలతో నిండివుంది. అతని నేత్రాలలో నిర్మలమైనకాంతి ప్రతిఫలిస్తూవుంది. యెడమభుజంమీదినుండి మూడు పోగులు హృదయం మీదుగా వేలాడుతున్నాయి. వాటినిచూచి, అతనింకా బ్రహ్మచారని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు రాజు. అతనే రాజును చూచి, కరణం వీరరాఘవనాయుడుతో—

"యేరా వీరయ్యా! యితనెవరు?" అని అడిగాడు.

"అతనా! క్రొత్తగా నిన్న వూరిలో పిల్లల చదువుకు గాను బదిలీ అయ్యాడు స్వామీ! వూరికి క్రొత్త," అని చేతులు కట్టుకున్నాడు. రాజు అర్చకునికి

"నమస్కారం తాతగారూ!" అని నమస్కరించాడు. అతను చిరునవ్వు నవ్వాడు.

"మంచిది నాయనా! నీపేరేమిటి?"

"రాజా స్వామీ!"

"అయితే! పద అరుగుమీదకూర్చుందాం" ! అని అర్చకుడు మెల్లగా మెట్లెక్కాడు. అర్చకునికి కొద్ది దూరంగా రాజూ, వీరరాఘవనాయుడు, యితరులూ కూర్చున్నారు.

చెరువు కట్టమీద తాటిచెట్లు వరుసగా సమాన స్థాయిలోవున్నాయి. దూరంగా అభ్రకపుగనులు తళ తళ మెరిసిపోతున్నాయి. వుత్తరాన సిద్ధప్ప కొండ సాయంత్రపు యెండలో నీడలు తేలుతుంది. ఆ మనోహర ప్రకృతిని చూస్తూ రాజు తన్మయత్వం పొందాడు. తను పుట్టిన దినంనుండీ యింతవరకు బస్తీ గోడలు దాటలేదు. కూపస్థమండూకంలా అదే ప్రపంచం, అదే స్వర్గమనుకుని మోసపోయాడు. పడమటి కొండలలో సూర్యబింబం మరుగుపడుతూ యెర్రనికాంతిని ప్రతిఫలింపజేస్తుంది. చెరువుకట్ట మీదుగా పశువులమందలు తిరిగివస్తున్నాయి. ఇలాంటివి రాజింతవరకు చూచి యెరుగడు.

రాజుకు ఆ అర్చకునిగూర్చి తెలుసుకోవాలన్న వుబలాటం జాస్తయింది. మెల్లగా "తాతగారు ..." అని ఆపివేశాడు. రాజు అడుగుతూ నడుమ ఆగిపోవడంచూచి ఆ అర్చకుడు "చెప్పు నాయనా! ఫరవాలేదు ! నాకు తెలిస్తే నీ అనుమానం తీరుస్తాగా!" అన్నాడు.

రాజుకు ధైర్యం కలిగింది.

"మీరీవూర్లో యెన్ని సంవత్సరాలుగా వుంటున్నారు ?"

"అదా ! నేను పుట్టింది యీ వూరిలోనే, నేను యింతవరకూ అంటే నాకిప్పుడు యెనిమిదో పదిసగం దాటింది. పెరిగిందికూడా యిక్కడే ! చచ్చిపోవాలనుకుంటున్నదికూడా యిక్కడే ! కాని నా అదృష్టం యీ నాగేశ్వరస్వామిమీద ఆధారపడి వుంది."

"అయితే తాతగారూ ! యీ ఆలయం యెన్నాళ్ళయింది, యిక్కడ వెలసి ?"

"అయిదు తరాలనాటి మాటది నాయనా!"

"అయితే స్వామీ ! ఆ తెట్టు తెల్లశివలింగం వుండే! అన్ని శివలింగాలు నల్లగా వుంటాయనుకుంటాను ! ఈ ఆలయానికి దానికి సంబంధమేమిటి?"

"తెలుసుకోవలసిన ప్రశ్న వేశావు నాయనా ! ఈ వూరి చరిత్ర దానిమీదనే ఆధారపడివుంది !"

"అయితే మీకేమయినా తెలుసా !"

"ఆ ! దాన్ని గురించి యిప్పటికి చాలామంది నన్ను అడిగారు ! కాని వారికి చెప్పేటంత అవకాశం నాకు లేకపోయింది ! ఆ తెల్లటి శివలింగమున్నావే దాని చరిత్ర నిజమో అబద్ధమో నాకు తెలియదు ! మా పూర్వీకులనుండీ మైలురాయిలా ఒకరి వెంబడి ఒకరికి తెలిపిపోతున్నారు."

"అయితే ! మరి మీ అనంతరం దీని కర్చకులెవరు తాతగారూ !"

"అది యీశ్వరుడికే తెలియాలి ! నీవు చూచిన ఆ తెల్లబండను యీ వూరిలో దానిచరిత్ర తెలిసిన వారందరూ "పిడకలగంప" అని పిలుస్తారు."

"అయితే ఆ పిడకలగంపకు దాని చరిత్రకు యేమయినా పోలికవుందా తాతగారూ ?"

"అదే నాయనా చెబుతున్నానుగా ! ఇప్పటికి అయిదు తరాలకు పూర్వంనాటికథ. అప్పటికి యీ వూరు యేమంత పెద్దదిగాదు. ఒక అరవై కుటుంబాలతో మనుమసిద్ది మహారాజు చల్లని చూపులక్రింద యేలబడుతూవుండేది. చుట్టూరూ మామిడితోపులు, చింత, తాటితోపులతో కలకలలాడుతుండేది.

ఆ కుటుంబాలలో పది మినహాయించి, తక్కిన వన్నీ బ్రాహ్మణులవి. వారు సద్గుణవంతులూ,

సకల శాస్త్ర కోవిదులై, ఆ నాటి రాజుల మన్ననలకు పాత్రులై, సకల సౌఖ్యాలతో యెంతో వైభవంగా నివసించేవారు. అందులో గొప్పవారు ఆ నాటి రాజులక్రింద కరణాలుగావుండి పేరుతెచ్చుకునేవారు. అప్పటి వారి భక్తికిమెచ్చి యీ నాగేశ్వరుడు లింగం తట తానే వెలిశాడంటారు. అప్పటినుండీ యీ వూరికి యిలవేల్పు యీ స్వామే! ఈ దేవుని వుత్సవాలు యీ వూరికి వసంతోత్సవాలు. అప్పుడీ వూరిని వేదపురమనీ, గుణపురమనీ పిలిచేవారట నాటుకునా!

అప్పుడు వారు, రాజులిచ్చిన భూములను సస్యశ్యామలంచేసి, ఒకప్పుడు కర్షకులుగాను, మరొకప్పుడు దైవార్చకులుగాను, యితరులకు తమకు యేలాటి కష్టం కలుగకుండా తమలో తామే సంబంధాలు కుదుర్చుకుంటూ పేరుగాంచారు.

వేదమూర్తి యీ వూరికి ఆనాటి కరణం. రాజులకూ పేదలకు మిత్రుడు. అతనంటే మిగిలిన వారందరూ దైవసమానుడని తలచేవారు. అతని వొంకు లొంకుల జుట్టు, విబూధిరేఖలు, రుద్రాక్షమాలికలు చూచినవారికి బ్రహ్మక్షాత్రమును బోధించేవట.

వేదయ్యకు ఒక్కగానొక్క చెల్లెలు గుణవతి! ఆమెకు జాతక కర్మలు చేసేటప్పుడు జ్యోతిష్కులు 'ఆమెకు భర్తలేడు! దేవుడేభర్త' అని తీర్మానించారు. అందుకు పంచభూతాలు గూడా ఘోషించాయట! ఆ మాటలతో వూరూవాడా మ్రోగింది. అందరూ ఆమె దైవాంశసంభూతురాలనుకున్నారు. ఆమె పెరిగి పెద్దదయింది.

ఆమె పెరుగుతున్న కొలది యౌవనం, దేవుని మీద భక్తి జాస్తికాజొచ్చాయి. ఆమె వైఖరిచూచి వేదయ్య ఆశ్చర్యపోయాడు. తన చెల్లెలు ఒకగొప్ప భక్తురాలవుతుందనుకున్నాడు. ఆమె నుగురించి వూళ్ళో యెన్నోవిధాల అనుకున్నారు. పూర్వం అనుకున్న మాటలు యిప్పుడు నిలిచేవిగాదు. అవి మారుతుండేవి. వాటితోగూడా వారి మనసులుగూడా మారేవి. 'ఆమె దైవాంశ సంభూతురాలట! దేవుడే భర్తట' అనికొందరు. 'యెంతగొప్పవారయినా యీడొచ్చినపిల్లను యింకా యింటిలోవుంచుకుంటారా! ఆచారాలన్నీ మంటగలుస్తున్నాయి!' యిలాంటి మాటలు గుణవతితండ్రికి ములుకుల్లా గ్రుచ్చుకున్నాయి. వెంటనే గుణవతికి పెండ్లి చేయాలని నిశ్చయించుకున్నాడు.

"కానీ వేదయ్య తన తండ్రిని గుణవతికి పెండ్లి చేయవద్దని యెన్నో విధాలచెప్పిచూచాడు ఆ మాటలతో వేదయ్య తండ్రికి పట్టుదల మరీ జాస్తయింది. గుణవతి కాపురం సాగించాలన్నాడు. తన కెదురు తిరిగితే నాశనం చేస్తానన్నాడు. అతని ఆగ్రహం చూచి వూరంతా కంపించి పోయింది. వేదయ్యకు తండ్రి నెదిరించడానికి మనస్కరించలేదు. తుదకు నాగేశ్వరుని" పాదాలకు మా సంసారాన్ని గట్టెక్కించే భారంనీదే! మాతప్పులు క్షమించి మమ్మల్ని కాపాడు దేవా" అని వేడుకొన్నాడు.

ఎంతో ఆశపడి గుణవతికి వెంటనే పెండ్లి జేసిన ఆ తలిదండ్రుల ఆశ నిరాశయింది. గుణవతికి పెండ్లి జేశారనేగానీ ఆమె యే సంగతి పట్టించుకోలేదు. దినమంతా దైవధ్యానంలో గడిపేది. సంసారపు టొచ్చులో తగులుకోలేదు. గుణవతి అత్తమామలు తమ వంశవృక్షం కాయలు కాయబోతున్నదని సంతసించారు. వారి కోరిక తీరలేదు. గర్భాదానం నాటికి గుణవతిభర్త యేరోగం, యేఅపదాలేక ప్రశాంతంగా ప్రాణాలు విడిచాడు.

(సశేషము)